క్లుప్తంగా

చెత్త తరలింపు



తిరువూరు: స్థానిక 19వ వార్డులోని అక్కపాలెం రోడ్డులో ఇష్టానుసారం పడేస్తున్న చెత్తాచెదారంతో తాము ఇబ్బంది పడుతున్నామని పలువురు ఫిర్యాదు చేయగా, వార్డు కౌన్సిలర్ పరసా సత్యనారాయణ స్పందించారు. నగర పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టి రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన కొబ్బరిబోండాల వ్యర్థాలు, మాంసఖండాలు, చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డుకు తరలించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే 'చెకుముకి'



తిరువూరు: చెకుముకి టాలెంట్ టెస్టు ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో శనివారం రాత్రి చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయిలో చెకుముకి పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రాయదలచిన విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించాలని కోరారు. సమావేశంలో జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, సుదర్శన్, నాగేంద్రప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

విస్సన్నపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో స్థానిక లయన్స్‌క్లబ్ మల్టీహాల్లో సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. నూజివీడు గిఫర్డు మెమోరియల్(అమెరికన్) హాస్పిటల్ కంటి వైద్యులు రోగులను పరీక్షించనున్నట్లు పేర్కొన్నారు. శుక్లాలు ఉన్నవారికి నూజివీడు అమెరికన్ హాస్పిటల్లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా మరియమాత ప్రతిష్ట ఉత్సవం

చాట్రాయి: గుణదల్లోని మరియమాత విగ్రహ ప్రతిష్ఠించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని చనుబండ ఆర్‌సీఎం చర్చి విచారణలో ఆదివారం క్రైస్తవులు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుణదల్లో మరియమాత విగ్రహాన్ని గ్రామంలో పాటలు పాడుతూ ఊరేగించారు. విజయవాడ మేత్రాసన పరిధిలో 101 విచారణల్లో మరియమాత విగ్రహాన్ని ప్రజల సందర్శనార్థం ఊరేగిస్తున్నామని ఫాదర్ జి.నరేష్ తెలిపారు.

ఆర్థిక సాయం



ముసునూరు: అనారోగ్యం, ప్రమాదాలతో సొసైటీ సభ్యులు మృత్యువాత పడితే తమ సహకార సంఘం తక్షణ సాయంతో ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని చింతలవల్లి వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల మృతి చెందిన సంఘ సభ్యుడు పిల్లి రంగారావు కుటుంబానికి సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరపున అంతిమ సంస్కారాల కోసం తక్షణ ఆర్థిక సాయంగా రూ.10 వేలను రంగారావు భార్య పద్మకు ఆదివారం అందజేశారు. గ్రామ సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్, పెద్దలు రవీంద్ర, సుందరం,ఆల్ఫ్రెడ్, సొసైటీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసా నంద సరస్వతి తెలిపారు. అయోధ్యనగర్ క్షత్రియ భవనంలో ఆదివారం హిందూ ధార్మిక పరిషత్ వ్యవస్థాపకులు బుద్ధరాజు శివాజీ రాజా ఆధ్వర్యాన నిర్వహించిన విలేకర్ల విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు హిందూ దేవాలయాలు, ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాగుండాలన్నదే హిందూ మతం సారాంశం అన్నారు. శివస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పనిచేసే వారికే దేవాలయాల ట్రస్ట్ బోర్డులలో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా హిందువులు సంఘటితంగా ఉండి హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని తీర్మానం చేశారు. విశ్రాంత సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వర రావు, హిందూ సంఘాలు ఐక్య వేదిక అధ్యక్షుడు లలిత్ కుమార్, రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షుడు హమార ప్రసాద్, హిందూ సంఘాల నాయకులు రమణ కాసారపు, కల్యాణ్‌కుమార్ చెట్లపల్లి, వీవీఆర్ కృష్ణంరాజు, శ్రీనివాస్ యాదవ్, ఫణీంద్ర, పీవీ సతీష్, వరప్రసాద్ పలువురు పీఠాధిపతులు, విశ్రాంత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.21.15 కోట్లతో ఏరియా ఆస్పత్రి అభివృద్ధి

నూజివీడులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. రెండు నెలల్లో నిర్మాణాలన్నింటినీ పూర్తిచేసి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకునేందుకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నారు. రూ.21.15 కోట్లతో వంద పడకల ఆస్పత్రిలో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులు పూర్తయితే మరిన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు డివిజన్‌లోని పేదలకు అందుబాటులోకి రానున్నాయి.

నూజివీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు, వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ ఆస్పత్రి అభివృద్ధికి రూ.21.15 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనులు పూర్తయితే డివిజన్‌లోని ఆరు మండలాలతో పాటు తిరువూరు రెవెన్యూ డివిజన్‌లోని రెడ్డిగూడెం, ఏ కొండూరు, విస్సన్నపేట నుంచి స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చే వందలాది మంది ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం ఉన్న వంద పడకలను నూతన భవనంలో ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్‌లో దీనిని రెండు వందల పడకల స్థాయికి పెంచేందుకు కూడా అవకాశం ఉంటుంది. ఈ ఆస్పత్రిలో ప్రస్తుతం గైనకాలజీ, ఎముకలు, నేత్ర, జనరల్, చిన్నపిల్లల వైద్యసేవలు అందిస్తున్నారు. నిత్యం ఓపీ ఐదు వందల నుంచి ఆరు వందల వరకు ఉంటుండగా, నెలకు శస్త్రచికిత్సలు 200 వరకు జరుగుతున్నాయి.

జీ+3గా భవన నిర్మాణం

రూ.21.15 కోట్లతో చేపట్టిన నూతన భవనాన్ని జీ+3గా నిర్మిస్తున్నారు. మెడికల్, సర్జికల్, గైనిక్, ఆప్తమాలజీ, చిన్నపిల్లలు, ఈఎన్‌టీ వంటి విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆయా వార్డుల ఇన్‌పేషెంట్ విభాగాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించనున్నారు. నాలుగు ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, మూడు ఐసీయూలు, ఆరు జనరల్ వార్డులు, పరిపాలన విభాగం, రక్త పరీక్ష ల్యాబ్‌లు, ఎక్స్‌రే యూనిట్‌లు, బ్లడ్ బ్యాంకు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు ఎముకలకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేయాలంటే తప్పనిసరిగా విజయవాడకు రిఫర్ చేసేవారు. రానున్న రోజుల్లో ఇక్కడే ఎముకలకు సంబంధించిన ఆపరేషన్లను నిర్వహించనున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, చర్మం సంబంధిత పలు వైద్య సేవలు సైతం ప్రజలకు అందించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. కనీసం రక్త పరీక్షలు కూడా చేసేవారు కాదు. అన్నీ కూడా అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చి ప్రజాధనాన్ని దోచుకున్నారు.

23 మంది స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలు

గత టీడీపీ ప్రభుత్వంలో ఏనాడు 10 మందికి మించి వైద్యులు లేరు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆస్పత్రిల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుతం 23 మంది స్పెషలిస్టు వైద్యులు ఉండి ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారు. గైనకాలజిస్టులు-3, జనరల్ సర్జన్స్-2, చిన్నపిల్లల వైద్య నిపుణులు-2, మత్తు వైద్యులు-3, జనరల్ మెడిసన్ వైద్యులు-2, ఎంబీబీఎస్ వైద్యులు-4, నేత్ర, దంత, ఈఎన్‌టీ, ఆర్థో, సివిల్ సర్జన్, పాథాలజీ, చర్మ వ్యాధి వైద్యులు ఒకొక్కరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. దీనిని బట్టే ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోంది.



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో నూతన భవనం



ఆస్పత్రి ఆవరణలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారాయి



రాష్ట్ర ప్రభుత్వం రూ.21.15 కోట్లతో నూతన భవనాన్ని నిర్మిస్తుండటంతో పాటు 23 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించింది. పేదలకు అన్ని రకాల వైద్యసేవలను ప్రభుత్వం ఇక్కడే అందిస్తోంది. ఆధునిక పరికరాలు, యంత్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చివేశారు. ఈ సదుపాయాలన్నింటినీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎమ్మెల్యే నూజివీడు

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమల్లో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సేవా పుస్తకంలో డీఏ ఎరియర్స్ నమోదు చేయాలి

మైలవరం: ఉద్యోగుల డీఏ ఎరియర్స్, పీఆర్‌సీలు సేవా పుస్తకాల్లో నమోదు చేయాలని పీఆర్‌టీయూ మైలవరం శాఖ అధ్యక్షకార్యదర్శులు పీ గోపాల్, ఎం.వెంకటేష్ తెలిపారు. మైలవరం పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూనియన్ సమావేశంలో అధ్యక్షకార్యదర్శులు మాట్లాడారు. పాత సరెండర్ లీవ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ స్థానంలో వచ్చిన జీపీఎస్‌పై చర్చించాలని, జీపీఎస్ అమలు చేయాలన్నారు. రిటైర్ అయ్యేవారికి పీఎఫ్ అన్ని కూడా సేవా పుస్తకాల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. మహిళా బిల్లు ఆమోదించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. పీజీటీ, ఎంఈఓల జీతాలు త్వరగా చెల్లించాలని కోరారు. సమావేశంలో సభ్యులు సతీష్, పుల్లారెడ్డి, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటుగా ప్రజల అవసరాలను గుర్తించి అధికంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన వైఎస్సార్ సీపీకి మాత్రమే 2024 ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. గంపలగూడెం మండలం తోటమూల జీబీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా అవినీతి రహితంగా, దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తూ నూటికి నూరుశాతం సంక్షేమఫలాలు లబ్ధిదారులకు అందేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి మండలపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించినున్న ×ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని పార్టీ నాయకులు విజయవంతం చేయాలన్నారు. ఎంపీపీ గోగుమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కే శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరరావు, మండల సచివాలయాల కన్వీనర్ బాదినేని వీరబాబు, మాజీ ఎంపీపీ కోట దాసు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, బొల్లా కరుణాకరరావు పాల్గొన్నారు.



గంపలగూడెంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే రక్షణనిధి

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

తిరువూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి సూచించారు. ఆదివారం సాయంత్రం తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ×ఆంధ్రాకు మళ్లీ సీఎంగా జగనే ఎందుకు కావాలి? అనే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 నుంచి ప్రతి వార్డులో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కోరారు. గత నాలుగున్నరేళ్లుగా జరిగిన అభివృద్ధితో పాటు ప్రజలకు అందిన పలు పథకాలతో కూడిన సమాచారంపై పార్టీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, నాయకులు వెలుగోటి ఆదినారాయణ, రేగళ్ల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



తిరువూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏ.కొండూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని గోపాలపురం కల్యాణ మండపంలో ఆదివారం ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే? అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రతి గ్రామంలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దాసరి సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఏ. వెంకటరెడ్డి, టి.వెంకటేశ్వర రెడ్డి, కే చెన్నారావు, పి.చంద్రమోహనరావు, అమీన్, ఎం. సాంబయ్య, ఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్

జూపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని జూపూడి సచివాలయం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.అనిల్‌కుమార్ తెలిపారు. శిబిరంలో వివిధ రకాల వ్యాధులకు నిపుణులైన వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామ సచివాలయం -1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించనున్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ తెలిపారు. డాక్టర్ కె శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు పాతరావిచర్లలో

నూజివీడు: పాతరావిచర్లలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తారని పేర్కొన్నారు.

చొప్పరమెట్లలో..

నూజివీడు(ఆగిరిపల్లి): చొప్పరమెట్లలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పీ శంకర్‌రావు తెలిపారు.

చాట్రాయిలో..

చాట్రాయి: జనార్దనవరం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు ఇస్తారని పేర్కొన్నారు.

మేడూరులో..

మేడూరు(గంపలగూడెం): 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రోగ్రాం సోమవారం గంపలగూడెం మండలం మేడూరులో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సచివాలయం వద్ద వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న పోషకాహార ప్రదర్శనలు

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఐసీడీఎస్ ఏర్పాటు చేస్తున్న పోషకాహార ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని అక్కిరెడ్డిగూడెం, ముసునూరు సెక్టార్ల సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి ప్రత్యేక పర్యవేక్షణలో ఆయా గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తయారు చేస్తున్న బలవర్ధకమైన ఆహార పదార్థాలు రుచి, శుచితో వైద్య ఆరోగ్య శిబిరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రక్తహీనత నివారణకు అవసరమైన పోషక పదార్థాలు అధికంగా లభించే ప్రధాన వనరులతో వంటకాలు సిద్ధంచేసి, వాటి తయారీపై ప్రజలకు ప్రత్యేకంగా వివరిస్తున్నారు. బాలామృతం, రాగి పిండి, ఎండు ఫలాలు, చిరుధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలతో తయారు చేసిన వివిధ రకాల స్వీట్లు, ఇతర ఆహార పదార్థాల రుచిని, శిబిరానికి వచ్చిన నేతలు, అధికారులు, సామాన్య ప్రజలకు అందించి, ఆస్వాదింపజేస్తున్నారు. దీంతో పోషకాహార ప్రదర్శనలు వైద్య శిబిరాల్లో ప్రధానమైన అంశంగా మారాయి. దీనికి తోడు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార తయారీలో వాడిన ఆహార పదార్థాలను వివరిస్తుండడం మరింత ఉపయుక్తంగా మారింది. అతి తక్కువ ఖర్చుతో పోషకాహారాన్ని ఇంట్లోనే తయారు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ప్రజలకు తెలియజేస్తూ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా లభ్యమయ్యే ప్రయోజనాలను వివరిస్తున్నారు. బలివే శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష అనే అక్షరాలతో చిన్నారుల తలలకు అమర్చిన కిరీటాలు అందరినీ ఆకర్షించాయి. దీనికి తోడు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, చేతుల స్వచ్ఛత పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. వ్యాయామం, యోగా చేయాలని పేర్కొన్నారు.



బలివే పోషకాహార ప్రదర్శనలో ఎంపీపీ కృష్ణకుమారి

వాకర్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: తిరువూరు వాకర్స్ క్లబ్ కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు.స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సంగా వెంకటేశ్వరరావు,ఉపాధ్యక్షుడిగా నాళ్లా సాయిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా వాసం చిన్నికృష్ణ,కోశాధికారిగా గొండేల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

గణపతి లడ్డూ ప్రసాదం రూ.60వేలు



చంద్రగూడెం(మైలవరం): మైలవరం మండలం చంద్రగూడేం గ్రామంలో గణనాథుని లడ్డూ వేలం పాటను గ్రామానికి చెందిన శీలం వీరబాబు దక్కించుకున్నాడు. చంద్రగూడం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద నైవేద్యంగా ఏర్పాటు చేసిన 21 కిలోల లడ్డూను శీలం వీరబాబు రూ.60కు ఆదివారం నిర్వహించిన వేలం పాటలో సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహకులు పాటదారు వీరబాబును శాలువతో సత్కరించి, మేళ తాళాలతో ఆయన స్వగృహానికి వెళ్లి అప్పగించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణస్వామి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


నూజివీడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆదివారం డీఎస్‌డబ్ల్యూ, స్టూడెంట్ సహాయ మిత్ర, ఇగ్నైటెడ్ మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్ మూడు, నాలుగో సంవత్సరాలకు చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారికి, శస్త్రచికిత్సల సమయంలో, తలసేమియా వ్యాధి గ్రస్తులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి షేక్ రియాజ్ హుస్సేన్, నూజివీడు ఏఓ పీ ప్రదీప్‌కుమార్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ రాము, రూప, ఆస్పత్రి కో-ఆర్డినేటర్ శిరీష రాణి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు

కార్పొరేట్ల దాడి నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించాలి

మైలవరం: కార్పొరేట్ల దాడి నుంచి వ్యవసాయ రంగానికి రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. మైలవరం మార్కెట్ యార్డులో అఖిల భారత రైతు, వ్యవసాయ కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గిరీష్ అధ్యక్షతన రైతుల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా రైతులు వ్యవసాయ రంగం నుంచి బయటికి వెళ్లిపోయే పరిస్థితులు నెలకున్నాయన్నారు. వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి మీద ఉందన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ సిఫార్సు చేసిన సీ2-50ను చట్ట బద్ధం చేసే వరకు ఉద్యమించాలన్నారు. రైతులకు రుణ మాఫీ చేయాలని విన్నవిస్తే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయడం లేదన్నారు. కార్పొరేట్‌లకు మాత్రం రూ.16 లక్షల కోట్లు బకాయిలు ఎలా మాఫీ చేస్తారని ప్రశ్నించారు. రైతులందరూ సామాజిక బాధ్యతతో ఐక్యమై భవిష్యత్ తరాలను కాపాడుకోవాలన్నారు. నవంబర్ 26, 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకర్ ఘోష్, బీఎస్ అమర్నాథ్, లలిత, వెంకటరెడ్డి, నాగముత్యాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలి

అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

విజయవాడ కల్చరల్: సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో కలమిశ్రీ సంకలనపరచిన ప్రేరణ వ్యాస సంకలనం ఆవిష్కరణసభ బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజాన్ని ప్రేరణ కలిగించేది మంచి సాహిత్యం అవుతుందని తెలిపారు. కవిగా విల్సన్‌రావు సమాజాన్ని అధ్యయనం చేశారన్నారు. సాహితీవేత్త డాక్టర్ ప్రభాకరరావు మాట్లాడుతూ కవి విల్సన్‌రావు దేవుడు తప్పిపోయాడు కవితా సంకలనం రచించారని తెలిపారు. కవితా సంపుటి మీద పలువురు రచయితలు సమీక్ష చేశారని అదే వారికి ప్రేరణ కలిగించి వ్యాస సంకలనమైందన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచందు ప్రేరణ గ్రంథం విశేషాలను వివరించారు. పరిశోధకుడు జి.లక్ష్మీనరసయ్య గ్రంథాన్ని ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ అన్నవరపు బ్రహ్మయ్య, విప్లవ రచయితల సంఘం సంఘం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ ప్రసంగించారు. కవి విల్సన్‌రావు తనకు ప్రేరణ కలిగించిన అంశాలను వివరించారు. వ్యాస రచయితలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



ఆవిష్కరణ సభలో లక్ష్మీ నారాయణ, డాక్టర్ ప్రభాకర్, కలిమిశ్రీ, విల్సన్‌రావు, డాక్టర్ జీవీ పూర్ణచందు

మాదిగలు జగన్ నాయకత్వాన్ని బలపర్చాలి

మైలవరం: మాదిగలు ఐకమత్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మాదిగల ఆత్మీయ సమ్మేళం నాయకులు ఎన్. ప్రకాష్, బి.శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాయకుడు ప్రకాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మాదిగలకు ప్రాముఖ్యత లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో మాదిగలు సమైక్యంగా కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 19న హెచ్ ముత్యాలంపాడు గ్రామంలోని రాజు మామిడి తోటలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం ఆధ్వర్యంలో వన భోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు టీ యేసు, మందా నోవా, ఎస్.చిన్నయ్య, ఐ.చంటి, మాజీ సర్పంచ్ బి.రాజా, సగ్గుర్తి వెంకటరత్నం, మేరీ ప్రశాంతి పాల్గొన్నారు.